క్లుప్తంగా

బాపట్ల పట్టణ సీఐగా శ్రీనివాసులు

బాపట్లటౌన్‌: బాపట్ల పట్టణ సీఐగా యు. శ్రీనివాసులును నియమిస్తూ ఆదివారం రేంజ్‌ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఐగా పనిచేస్తున్న పి. కృష్ణయ్యను పల్నాడు జిల్లా నర్సరావుపేట రూరల్‌ సీఐగా బదిలీ చేశారు. రేంజ్‌ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులును బాపట్ల పట్టణ సీఐగా నియమించారు.

నేడు భట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

భట్టిప్రోలు: భట్టిప్రోలు–1 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్‌ దారా రవి కిరణ్మయి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్‌ మేరుగ నాగార్జున ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరు కావాలని తెలిపారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

భట్టిప్రోలు: వాస్తవాలను మరుగున పెట్టి అసత్య ఆరోపణలతో ఎదుటివారిపై బురద జల్లడమే పనిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పెట్టుకున్నారని వైఎస్సార్‌ సీపీ యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌ శాస్త్రి అన్నారు. భట్టిప్రోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ వార్డు సభ్యుడిగా ఓటమి పాలైన సాయిబాబా మతి భ్రమించి ఇటీవల ప్రభుత్వంపై, మంత్రి మేరుగ నాగార్జునపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. వారం వారం పోరుబాట పేరుతో వానర సైన్యంతో తాను చేసిన కార్యక్రమాలు, పనులను ప్రస్తుత ప్రభుత్వం విస్మరించిందని విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. ఇకపై సాయిబాబా అసత్య ప్రచారాల పరం పరకు స్వస్తి పలకాలని అరుణ్‌శాస్త్రి హితవు పలికారు. సమావేశంలో కో–ఆప్షన్‌ సభ్యులు షేక్‌ సలీమ్‌, పంచాయతీ సభ్యులు గోలి శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు మోర్ల కోటేశ్వర రావు, అమ్మిశెట్టి రమేష్‌, అంద్రాజు పోతురాజు, తుర్లపాటి గోపీ పాల్గొన్నారు.

వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు



కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని మధుమేహ వైద్యుడు చల్లా రామోహన్‌రావు తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది మధుమేహం, రక్తపోటు బాధితులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్‌ చల్లా రామోహన్‌రావు.. మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ట్రస్ట్‌ అధ్యక్షుడు, నేత్ర వైద్యుడు పేరలి బాలకృష్ణమూర్తి సతీమణి గిరిజాకుమారి ఇటీవల మృతి చెందటంతో ఆమె చిత్ర పటానికి రామకృష్ణ సేవా సమితి సభ్యులు నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు టీపీ సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే దేవత పోలేరమ్మతల్లి



గుంటూరు రూరల్‌: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి గ్రామ దేవత పోలేరమ్మ తల్లి అని రూరల్‌ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు అన్నారు. ఆదివారం చిన్నపలకలూరు గ్రామ దేవత పోలేరమ్మతల్లి ఆలయ వార్షిక పొంగళ్ల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ఊరేగింపుగా బిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్‌ ఇంద్ర, ఎం.వెంకటేశ్వర్లు, పి.నరసింహారావు, బాలకృష్ణ, నరేష్‌, భాస్కర్‌ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు ఎలుకల మందు తిని, ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన చేబ్రోలులో ఆదివారం జరిగింది. కాకుమాను మండలం పెద్దివారిపాలేనికి చెందిన వి.గోపీ చేబ్రోలులోని చెరువులో పాలేనికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. రెండు రోజుల క్రితం అత్తారింటికి వచ్చిన అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు ఇది గమనించి 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సం నిమిత్తం గోపీని తరలించారు.

ఈ-పంట సేఫ్‌..



చింతాయపాలెంలో ఈ-క్రాప్‌ బుకింగ్‌ పరిశీలిస్తున్న డీఏవో అబ్దుల్‌ సత్తార్‌ (ఫైల్‌

పక్కాగా జరుగుతున్న ఈ-క్రాప్‌ నమోదు

- ఖరీఫ్‌ సీజన్‌లో జోరుగు పంటల సాగు..
- ఈ–క్రాప్‌లో పంట నమోదు చేస్తేనే నష్ట పరిహారం
- పంట విక్రయానికి దోహదం, ఇతర రాయితీల వర్తింపు
- బాపట్ల జిల్లాలో సాగు విస్తీర్ణం 3.78లక్షల ఎకరాలు.
- 85 వేల ఎకరాలకు పైగా వివిధ పంటల సాగు
- పంట నమోదు చేయించుకుంటున్న రైతులు

కర్లపాలెం: ఖరీఫ్‌ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ–క్రాప్‌ బుకింగ్‌ ముమ్మరంగా సాగుతోంది. ప్రస్తుతం పలు రకాల పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్‌ బుకింగ్‌, ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఈ– క్రాప్‌తో లాభాలు..

♦ పంట నమోదు(ఈ–క్రాప్‌ బుకింగ్‌) చేయించుకోవడం వల్ల రైతులు పండించే ధాన్యాన్ని ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుంది. ధాన్యానికి సంబంధించిన నగదును రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తుంది.

♦ దురదృష్టవ శాత్తు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందేందుంకు ఈ–క్రాప్‌ బుకింగ్‌, ఈకేవైసీ దోహదపడతాయి.

♦ పంట దిగుబడి ఘననీయంగా తగ్గినప్పుడు అధికారులు పంటకోత ప్రయోగం ద్వారా దిగుబడులను నిర్ధారించి, గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారు. రైతులకు క్రాప్‌ ఇన్సూరెన్స్‌ అందించేందుకు చర్యలు తీసుకుంటారు.

♦ ఈ–క్రాప్‌ బుకింగ్‌ చేయించుకున్న రైతులు బ్యాంక్‌లో తీసుకునే రూ.లక్ష లోపు రుణాలు సకాలంలో చెల్లిస్తే..వైఎస్సార్‌ సున్నా వడ్డీ పథకం వర్తిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

బాపట్ల జిల్లాలో ఈ–క్రాప్‌ బుకింగ్‌ ఇలా..

♦ బాపట్ల జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 15 వరకు పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పంటలు సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులందరూ ఈ–క్రాప్‌ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ చేయించుకోవాలి. సెప్టెంబరు 19 నుంచి వ్యవసాయాధికారులు గ్రామ సభలు నిర్వహించి, పంట నమోదు, ఈకేవైసీ చేయించుకున్న రైతుల జాబితా గ్రామ సచివాలయాల వద్ద ప్రకటిస్తారు. 25నుంచి 28వ తేదీ వరకు రైతుల అభ్యంతరాలను స్వీకరించి, 30న ఫైనల్‌ లిస్టు ప్రకటిస్తారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.

♦ బాపట్ల జిల్లాలో 1.20లక్షల రైతులకు సంబంధించి 3.78లక్షల విస్తీర్ణంలో సాగు భూములు ఉన్నాయి. ఆగస్టు వరకు 85వేల ఎకరాలకు రైతులు వివిధ పంటల సాగు చేపట్టారు. 13 వేలకు పైగా రైతులు తాము సాగు చేసిన పంటలను నమోదు చేయించుకున్నారు.

ఆగస్టు వరకు జిల్లాలో సాగుచేసిన వివిధ పంటలు, ఈ- క్రాప్‌ నమోదు.. విస్తీర్ణం

పంట	ఖరీఫ్‌ సాగు విస్తీర్ణం	ఈ- క్రాప్‌ నమోదు
వరి	28.679 హెక్టార్లు	6.670హెక్టార్లు.
అపరాలు	757 హెక్టార్లు	364హెక్టార్లు
వేరుశనగ	557 హెక్టార్లు	188.హెక్టార్లు
పసుపు	476 హెక్టార్లు	49.6హెక్టార్లు
సోయాబీన్‌	48 హెక్టార్లు	24.8హెక్టార్లు

వీటితో పాటు పలు రకాల పంటల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

ధాన్యం విక్రయానికి దోహదం



పంట నమోదు చేయించుకోవటం వల్లే.. రైతు భరోసా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరకే ధాన్యాన్ని విక్రయించాను. ధాన్యానికి సంబంధించిన నగదు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నా బ్యాంకు ఖాతాలో వేశారు. – దుండి వీర మహేంద్రరెడ్డి, రైతు దుండివారిపాలెం.

అధికారుల సలహా మేరకు పంట నమోదు



పంట నమోదు చేయించుకోవటం వల్ల పలు ప్రయోజనాలున్నాయి. వ్యవసాయాధికారులు చెప్పటం వల్ల పంట నమోదు చేయించుకున్నాను. వారు మా పొలంలోకి వచ్చి పంట నమోదు చేశారు.
– ముదునూరి రామరాజు, రైతు, కర్లపాలెం.

ముమ్మరంగా ఈ– క్రాప్‌ బుకింగ్‌..

పంట నమోదు ముమ్మరంగా సాగుతోంది. క్రాప్‌ బుకింగ్‌ యాప్‌ ద్వారా రైతు, పంట వివరాలు నమోదు చేస్తున్నాం. ఈ–క్రాప్‌ బుకింగ్‌పై చాలా మంది రైతులకు అవగాహన లేకపోవడంతో వారిని చైతన్య పరుస్తున్నాం.. కౌలు రైతుల విషయంలో భూ యజమానుల నుంచి సహకారం లభించడం లేదు. వారితో కూడా చర్చించి, కౌలు రైతులు సాగు చేసిన పంటల నమోదు చేపడతాం. – ఏడీఏ ఎ.లక్ష్మీ, బాపట్ల.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు



బెల్లంవారిపాలెంలో సంక్షేమ కరపత్రం అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- బెల్లంవారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

నగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించడంతో పాటు.. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. బెల్లంవారిపాలెం, న్యూ అంబేడ్కర్‌ నగర్‌, ఘాలివారిపాలెం గ్రామాలలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందని స్వయంగా లబ్ధిదారులే చెబుతున్నారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా వేగంగా జరుగుతోందన్నారు. పేదలకు మంచి చేస్తున్న వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. న్యూ అంబేడ్కర్‌ నగర్‌లో 84, బెల్లంవారిపాలెంలో 400 గృహాలను ఎంపీ మోపిదేవి సందర్శించి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు శ్రీమన్నారయణ, శాంతిరాజు, రత్నబాబు, కొండల రెడ్డి, చిన సముద్రాలు, నన్నా మద్దయ్య, అధికారులు పాల్గొన్నారు.

పవిత్ర శ్రావణ మాసం..



ప్రత్యేక అలంకరణలో అడెమ్మ వారు



ప్రత్యేక అలంకరణలో దండిపార్వతీ అమ్మవారు

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లిలో ఆర్యవైశ్యులు శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం గ్రామ దేవత అడెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సామూహికంగా దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. అదే విధంగా స్థానిక అమ్మవారి చెట్టు వద్ద కూడా పూజలు జరిపారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘీయులు పాల్గొన్నారు. అలాగే భట్టిప్రోలు గ్రామ దేవత దండి పార్వతీ అమ్మవారిని గౌడ సంఘీయులు సామూహికంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేళ తాళాలు, కనక తప్పెట్లు, తీన్‌మార్‌లతో పుర వీధులలో తిరుగుతూ అమ్మవారి సన్నిధికి చేరుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు.



శ్రావణ మాసం వేడుకల్లో ఆర్యవైశ్యులు

అభయ ప్రధాయినిగా బగళాముఖి

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో శ్రావణ మాసం మూడవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయప్రధాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ధర్మకర్తల మండలి చైర్మన్‌ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ నరసింహమూర్తి, సిబ్బంది ఉన్నారు.



అభయ ప్రధాయనిగా దర్శనమిస్తున్న బండ్లమ్మ

బూరుగలమ్మకు సారె సమర్పణ

రేపల్లె: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఓల్డ్‌ టౌన్‌లో ఉన్న గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్‌ గురుకులు ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలతో కూడిన సారెను, సద్ది నైవేద్యాలను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో బూరుగులమ్మ

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న ఎస్‌ఎం హక్‌

కర్లపాలెం: విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని కర్లపాలెం జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. కర్లపాలెం హైవెండ్‌ ప్రైమరీ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఏత్రివారిపాలెం సర్పంచ్‌ చీరాల వెంకటలక్ష్మీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు పిచ్చిరెడ్డి, ఎస్‌ఎం.హక్‌, ఎం.అవంత, రంజిత్‌కుమార్‌, నవీన్‌, రాజ్‌కుమార్‌, ఆనందకుమారి, ఎస్‌ఎస్‌.హక్‌, స్వప్న.. చర్మ సమస్యలు, దంత, నేత్ర, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు సంబంధించి మొత్తం 500ల మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్‌ డైరెక్టర్‌ బొద్దు సాయి మహేంద్ర బాబు, చైర్మన్‌ ఉదయ్‌ చంద్రరావు, డైరెక్టర్‌ చాందినీ, హెచ్‌ఎం లక్ష్మి, ప్రముఖ ఆడిటర్‌ సాయిబాబా, తిమ్మరాజు సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రవణానందం..సత్యసాయి శత సంకీర్తనలు



సత్యసాయి బాబా సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన కట్లమ్మతల్లి దేవాలయంలో ఆదివారం సత్య సాయిబాబా శత సంకీర్తనలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంకీర్తనల ఆలాపన జరిగింది. అనంతరం హారతి కార్యక్రమాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు క్రోవి రామకృష్ణ నిర్వహించారు. భక్తులు, గ్రామంలోని భజన మండలి, భగవత్‌ భక్తులు అమ్మవారి దేవస్థానంలో జరిగే సంకీర్తనల కార్యక్రమంలో పాల్గొనాలని దేవస్థాన అభివృద్ధి కమిటీ తెలిపింది. ప్రతి నెలా మొదటి ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించింది.

ఇందేం 'శునక' వాదన..!

- మాచవరం ఎంపీడీఓ శునకానికి సుస్తీ..
- బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లిన అధికారి
- పశువుల వైద్యశాలకు వెళ్లాలని సూచించిన సిబ్బంది
- పేషెంట్‌ బెడ్‌పై పడుకోబెట్టి వైద్యం చేయాల్సిందేనని వాదన
- సర్దిచెప్పిన అవుట్‌పోస్టు పోలీసులు



ఏరియా వైద్యశాలలోని బెడ్‌మీద కుక్కను పడుకొపెట్టిన మాచవరం ఎంపీడీవో

బాపట్లటౌన్‌: తన పెంపుడు కుక్కకు ఆరోగ్యం సరిగా లేదని, తక్షణమే వైద్యసేవలు అందించాలంటూ పల్నాడు జిల్లా మాచవరం ఎంపీడీవో వరప్రసాదరావు ఆదివారం బాపట్ల ఏరియా వైద్యశాలలో హల్‌ చల్‌ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని క్రిష్టియన్‌ పేటకు చెందిన వరప్రసాదరావు మాచవరంలో ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. తన పెంపుడు కుక్కకు ఆరోగ్య బాగా లేదని ఏరియా వైద్యశాలలోని అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లారు. బెడ్‌మీద పడుకోపెట్టి తక్షణమే వైద్యసేవలు అందించాలని సిబ్బంది, వైద్యులను కోరారు. ఇది ఏరియా వైద్యశాల అని, ఇక్కడ కేవలం మనుషులకు మాత్రమే వైద్య సేవలు అందిస్తామని వారు తెలిపారు. పట్టణంలోని పశువుల వైద్యశాలకు వెళ్లాలని సిబ్బంది చెప్పినప్పటికీ సదరు ఎంపీడీవో వినిపించుకోలేదు. వారితో వాదనకు దిగారు. దీంతో వైద్యశాల అవుట్‌పోస్ట్‌ పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పి, అక్కడి నుంచి ఎంపీడీఓను పంపించివేశారు.

ఢిల్లీ అమృతవనం కోసం మట్టి సేకరణ

గుంటూరు మెడికల్‌: బీజేపీ నేతలంతా దేశమంతా ఇంటింటికి తిరిగి మట్టిని సేకరించి ఆ మట్టిని ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అమృతవనం ఏర్పాటు చేయటం జరుగుతుందని బీజేపీ గుంటూరు తూర్పు అసెంబ్లీ కన్వీనర్‌ డాక్టర్‌ శనక్కాయల ఉమాశంకర్‌ అన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేట శివాలయం వద్దూరివారి వీధిలో బీజేపీ ఆరవ మండల అధ్యక్షుడు సురేష్‌జైన్‌ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు ఇంటింటికి తిరిగి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్‌గౌడ్‌, పోతురాజు వెంకటేశ్వర్లు, శేషగిరి బాబురావు, గురు దత్తు, పలకలూరు శ్రీనివాసరావు, మనోజ్‌కుమార్‌ పాల్గొన్నారు. బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్‌ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో నా భూమి– నా దేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక విద్యానగర్‌లో ప్రజల వద్ద నుంచి బీజేపీ నేతలు మట్టిని సేకరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, మాగంటి సుధాకర్‌ యాదవ్‌, మాధవరెడ్డి, అప్పిశెట్టి రంగా, నాగమల్లేశ్వరి, రేణుకాదేవి, యోగేష్‌, పాటిబండ్ల విజయ్‌, తోట శ్రీనివాస్‌, వెంకటేష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే మానవత సంస్థ ధ్యేయం

సంస్థ రాష్ట్ర కన్వీనర్‌ ఎం. కోటేశ్వరరావు

బాపట్లటౌన్‌: పేదల అభ్యున్నతే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని సంస్థ రాష్ట్ర కన్వీనర్‌ ఎం. కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఏకో హౌస్‌లో ఉన్న రూఫ్‌ గార్డెన్‌లో ఆదివారం సంస్థ 103వ శాఖ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కమిటీలో బాపట్లశాఖ అధ్యక్షుడిగా డాక్టర్‌ బి.శరత్‌ బోస్‌, కార్యదర్శిగా డాక్టర్‌ పీసీ సాయిబాబు, కోశాధికారిగా వంకాయలపాటి హరిబాబు, సహాయ కార్యదర్శిగా ఎం.ప్రసన్నాంజనేయులు , కార్యనిర్వహక సభ్యునిగా జీవీ, డైరెక్టర్స్‌గా ఒ.శ్రీదేవి, పి. బసంత్‌ కుమార్‌, కె.శ్రీనివాసరావును ఎంపికచేశారు. వీరితో గుంటూరు శాఖ చైర్మన్‌ పావులూరి రమేష్‌ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారికి జామ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్‌ కో–ఆర్డినేటర్‌ ఎస్‌.జానికి రాజు, గుంటూరు శాఖ అధ్యక్షులు విమల కుమారి , డైరెక్టర్‌ ఉప్పల సాంబశివరావు, డాక్టర్‌ డి.శారద, వ్యవసాయ శాస్త్రవేత్త కె.పుండరీకాంక్షయ్య పాల్గొన్నారు.

ముగిసిన టైప్‌ రైటింగ్‌ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రేపల్లె రూరల్‌: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో రెండు రోజులుగా స్టేట్‌ బోర్డ్‌ ఆఫ్‌ టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ట్రైనింగ్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైప్‌రైటింగ్‌ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్‌ సూపరింటెండెంట్‌ చంద్రశేఖర్‌ మాట్లాడుతూ రెండవ రోజు టైపు రైటింగ్‌ జూనియర్‌ గ్రేడ్‌ కు ఇద్దరు, ఇంగ్లీషు లోయర్‌ గ్రేడ్‌కు 29 మంది, ఇంగ్లీష్‌ హయ్యర్‌ గ్రేడ్‌కు 9 మంది, తెలుగు లోయర్‌ గ్రేడ్‌కి ఇద్దరు, టైప్‌ రైటింగ్‌ తెలుగు హయ్యర్‌ గ్రేడ్‌కు ఒకరు, మొత్తం 43 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

ఆదాయంలో సగభాగం సేవకే

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ ప్రభాకర్‌

బాపట్లటౌన్‌: తాను సంపాదించే సంపాదనలో సగభాగం ప్రజా సేవకే ఖర్చు చేస్తానని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ ప్రభాకర్‌ తెలిపారు. ఆదివారం బాపట్ల పట్టణంలో అన్నం సతీష్‌ ప్రభాకర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వృద్ధాశ్రమం, వసతి గృహ భవన నిర్మాణానికి ఆయన శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఇకపై మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. వసతిగృహంలో సుమారు 400 మంది విద్యార్థులు, వృద్ధాశ్రమం వద్ద రెండు అంబులెన్స్‌లు ఉండేవిధంగా చూస్తామన్నారు. వసతి గృహం నిర్వహణను కాపు సంక్షేమ సంఘం సభ్యులు స్వీకరిస్తానని చెప్పటం ఆనందంగా ఉందన్నారు. ఇవే కాకుండా తమ ట్రస్ట్‌ తరపున ఉచిత అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అలాగే ఎటువంటి ఆసరా లేని వృద్ధులకు ప్రతిరోజు నేరుగా ఇంటి వద్దకే భోజనం అందజేయడం జరుగుతుందన్నారు. తన ట్రస్ట్‌కి ఎటువంటి విరాళాలు స్వీకరించమని కేవలం తన సొంత నిధులు తోనే ముందుకు సాగుతామని తెలిపారు. డిసెంబరు 11న వృద్ధాశ్రమం, వసతి గృహాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. 2024 డిసెంబరు నాటికి ఉచిత వైద్యశాలకు కార్యరూపం దాల్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మికి సన్మానం



ఝాన్సీలక్ష్మిని సత్కరిస్తున్న క్లబ్‌ సభ్యులు, పూర్వ విద్యార్థులు

రేపల్లె: పంచాయతీ రాజ్‌ శాఖలో మహిళల పాత్ర అనే అంశంపై పరిశోధనలు నిర్వహించి, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి ఇటీవల డాక్టరేట్‌ పట్టాను మదర్‌ థెరిస్సా యునెస్కో క్లబ్‌ అధ్యక్షురాలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఎ.ఝాన్సీలక్ష్మి అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పరిపూర్ణయ్య పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, మదర్‌థెరిస్సా మహిళా యునెస్కోక్లబ్‌ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేష్‌, క్లబ్‌ సభ్యులు అస్మా, విజయ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.